క్లుప్తంగా

అన్నదానానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్య అన్నదాన పథకానికి గురువారం ఓ భక్తుడు రూ.1,00.116 విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోనికి చెందిన తమ్మలి అమ్మని కుటుంబ సభ్యులు రూ.1,00,116 ను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరి దేవి

కోసిగి: స్థానిక కడపాళెం, సిద్దప్ప పాళెం కాలనీల్లో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గురువారం శ్రావణ మాస మాగశుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా జ్యోతి మహోత్సవాలు జరిపించారు. వేకువజామున అమ్మవారికి ఆలయ అర్చకులు గోవిందు స్వామి ప్రత్యేక పూజలు చేపట్టారు. జ్యోతిలను వెలిగించి పురవీధుల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

ఆదోనిఅర్బన్ : ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యమని కర్నూలులో వెలిసిన లతీఫ్ లొబాలి దర్గా ఉప పీఠాధిపతి సయ్యద్‌షా షఫీ పాషా ఖాద్రి అల్ హైదరీ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎస్ఎంటీ తాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదోని ముస్లీం మైనార్టీల ఆధ్వర్యంలో.. చలో కర్నూలు కార్యక్రమం, ముస్లిం లా బోర్డు సమావేశానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. హలే హైదిస్ జమాత్ ప్రతినిధి ఆఫీజ్ మంజూర్‌సాబ్, నోబుల్ సర్వీస్ సొసైటీ కర్నూలు ఉపాధ్యక్షుడు మౌలానా మహ్మద్‌సాదిక్, రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్‌దాదాపాషా, కర్నూలు ప్రభుత్వ ఖాజీ ముఫ్తీ షావలి అల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు నియాజ్‌అహ్మద్, ఆదోని ప్రభుత్వ ఖాజీ అల్తాఫ్ హుసేన్, ఆదోని ఖతిబ్‌సాబ్ జునైద్ హాస్మి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోసిగి: ఆదోనిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ టోని తెలిపారు. గురువారం పాఠశాలలో క్రీడాకారులను అభినందించారు. వారు మాట్లాడుతూ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో అఖిల్, లాంగ్ జంప్‌లో విష్ణువర్ధన్ ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. పౌర్ణమి లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది.

బీమా తక్షణ సాయం అందజేత

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన కురువ లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ పుణ్యావతి, ఎంపీటీసీ సభ్యురాలు బడెమ్మ ఆధ్వర్యంలో నామిని అయిన కుటుంబ సభ్యులకు గురువారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ మిగిలిన మొత్తం త్వరలోనే నేరుగా నామిని బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు.

జయప్రదం చేయండి

ఆదోనిరూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, రైతు, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే సమరభేరిని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పెద్దహరివాణం, సంతెకూడ్లూరు, కుప్పగల్ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు శేఖర్, తిక్కప్ప, అబ్బాస్, రామలింగప్ప పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్ : అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. పట్టణంలోని సిరుగుప్ప క్రాస్ వద్ద పట్టణానికి చెందిన బోయ వినోద్ 246 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండగా, గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్రాపర్టీని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేస్తిన్నట్లు చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం: యోగీంద్ర మంటపంలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హుబ్లీకి చెందిన బాలచంద్ర హిందూస్తాని సంగీత విభావరి, కీర్తనలు వీనుల విందు చేశాయి. బెంగళూరుకు చెందిన శ్రీమతి అలక దేశ్‌పాండె, శ్రీమతి ఉపాసన భరతనాట్య ప్రదర్శన భక్తులను అలరించింది.ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి భక్తజన నీరాజనం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి శ్రావణమాసపు ఉత్సవాల్లో భాగంగా మూడవ గురువారం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. బుధవారం మధ్యాహ్నం నుంచే తాకిడి మొదలవడంతో సాయంత్రం సమయానికి క్షేత్రంలో ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఇక గురువారం తెల్లవారుజాము నుంచి క్షేత్రానికి వెళ్లే దారులు వాహనాలతో నిండిపోయాయి. ఎంతలా అంటే వచ్చే వాహనాలతో కనీసం సైకిల్ కూడా పక్కన వెళ్లలేనంతగా జనం తరలివచ్చారు. ఇక స్వామి వారి దర్శనానికి క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దాదాపు లక్ష మంది వరకు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. అధిక శాతం భక్తులు ఆలయ పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ తగ్గకపోవడం విశేషం. ఏటా మూడవ సోమవారం, మూడవ గురువారం స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక ప్రాధాన్యతనివ్వడం ఆనవాయితీ. కోసిగి సీఐ ఏరిషావలి ఆధ్వర్యంలో కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి బందబస్తు నిర్వహించారు.





వెండి అలంకరణలో పూజలందుకుంటున్న ఈరన్నస్వామి,క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు



క్షేత్రంలో భక్తుల కోలహలం

హైవేకు భూములిచ్చే వారికి న్యాయమైన పరిహారం



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్ : నేషనల్ హైవే-167 నిర్మాణానికి భూములిచ్చే వారికి న్యాయమైన పరిహారం ప్రభుత్వం అందజేస్తుందని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు.గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో నేషనల్ హైవే-167కు స్థలాలు, పొలాలు ఇచ్చే 140 మంది రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ఆస్పరి రోడ్డు వరకు దాదాపు 2 కి.మీ. మేర హైవే ఏర్పాటుకు భూములు అవసరమవుతాయని, అందుకు సంబంధించిన వారికి ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తుందన్నారు. కావునప్రతి ఒక్కరు సానుకూలంగా స్పందించాలని కోరారు. కొందరు తమ స్థలాలను ఇవ్వడానికి విముఖత చూపడంతో సబ్‌కలెక్టర్ వారిని ఒప్పించి అంగీకారం తెలిపేలా చేశారు. త్వరలో వీరందరికీ పరిహారం అందించి, రోడ్డు పనులు చేపట్టబోతున్నట్లు ఆయ చెప్పారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డి, సర్వేయర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్





డీఎస్పీ శివనారాయణ స్వామికి రాఖీ కడుతున్న విద్యార్థిని,సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఆదోని సెంట్రల్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకొనే రాఖీ పండుగను పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో గురువారం డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు విద్యార్థినులు రాఖీ కట్టారు. ఎస్ఎఫ్ఐ నాయకురాలు శిరీష మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. అనంతరం డీఎస్పీ, సబ్ కలెక్టర్ విద్యార్థినులను ఆశీర్వదించి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

తిరుపతిలో విద్య, వైజ్ఞానిక సదస్సులు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: తిరుపతిలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు విద్యవైజ్ఞానిక సదస్సులు నిర్వహిస్తామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, సహాయ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. గురువారం ప్రభుత్వ బాలికల కళాశాల అవరణలో విద్యార్థినులతో కలసి కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని మండిపడ్డారు. మెడికల్ కళాశాల సీట్లలో పేద మధ్యతరగతి విద్యార్థులకు అడ్డంకిగా మారిన 107,108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు. శిల్ప, సంజన, అఖిల, వర్ష, లక్ష్మిప్రియ, శాంతి పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రద్దీతో దర్గా పరిసరాల్లో సందడి నెలకొంది. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. అనంతరం భక్తుల్ని దర్శినానికి అనుమతించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు : స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 2023 - 2024 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారిణి రుక్సానా పర్వీన్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన, ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలను సందర్శించాలన్నారు. అవసరమైతే సెల్ 83410 12231 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు.

ఆదోనిఅర్బన్ : స్థానిక మంగరాయ సన్నిధిలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పూర్వారాదణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయస్వామి, రాఘవేంద్రస్వామి, ప్రహ్లాదస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. విశేష ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తేనాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పూలతో అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కనకాభిషేకం, హోమాలు, పల్లకోత్సవం, ఆలయ ప్రాంగణంలో రథోత్సవం చేపట్టారు. బ్రాహ్మణుల ఆచారం ప్రకారం ఐదుగురు బ్రాహ్మణులకు అన్న సంతర్పణం ఏర్పాటు చేశారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న ఏడీఏ గిరిష్

కౌతాళం: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆదోని వ్యవసాయ సంచాలకులు గిరిష్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎం ఆర్‌పీకే ఎరువులు అందజేస్తారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మండలానికి 4,417 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మలని లక్ష్యం నిర్దేశించామని ఇందులో 1,506 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించామన్నారు. ఇప్పటి వరకు 869 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించామని, మిగిలినవి స్టాక్ ఉన్నట్లు చెప్పారు. ఆదోని సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 1.80లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారని ఇందుకు గాను 14,258 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించాలని లక్ష్యం నిర్ణయించామని, అందులో 4,058 టన్నుల ఎరువులు డివిజన్‌లోని 94ఆర్బీకేలకు పంపిచామని, వాటిలో ఇప్పటి వరకు 2,120 మెట్రిక్ టన్నులు అమ్మినట్లు వివరించారు. మండల వ్యవసాయాధికారి శేషాద్రి పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే గ్యాస్ ధర తగ్గింపు



సమరభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కౌతాళం: ఎన్నికల సమిపిస్తున్న తరుణంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధర తగ్గించి ప్రజల్ని మోసం చేయాలని చూస్తుందని సీపీఎం మండల సీనియర్ నాయకుడు మల్లయ్య, కన్వీనర్ ఈరన్న అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, రూ.450గా ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200లకు చేరుకుందన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, వాటిలో మళ్లీ గెలుపొందాలని గ్యాస్ ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించిందని చెప్పారు. మరోసారి అధికారంలోకి వస్తే ప్రజలు జీవించడానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. ధరల నియంత్రణ కోసం సమరభేరి కార్యక్రమం చేపట్టామని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు వెంకటేశ్, పామన్న, ఖాదరమ్మ, మాంతమ్మ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతలామునిస్వామి ఆరాధనోత్సవాలు



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆదోనిరూరల్ : మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో కొలువైన సద్గురు చింతలామునిస్వామి 40వ ఆరాధనోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభించి గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు.

కొనసాగిన నిరసన

ఆదోనిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూతన విధానం అమలుచేయడాన్ని నిరసిస్తూ డాక్యుమెంట్ రైటర్‌లు చేపట్టిన నిరసన గురువారం కొనసాగింది. షాపులను తెరవకుండా మూసివేశారు. దీంతో కేవలం నాలుగు మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయని సబ్‌రిజిస్ట్రార్ రాజశేఖర్ తెలిపారు.



త్రిమూర్తుల పట్టు వస్త్రాల సమర్పణలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తజనంతో కిక్కిరిసిన మంత్రాలయ క్షేత్రం



పీఠాధిపతి నుంచి అనుగ్రహ ప్రశస్తి అవార్డు అందుకుంటున్న పద్మశ్రీ గరికపాటి నరసింహారావు

శ్రీమఠంలో రాఘవుడి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతోగురువారం క్షేత్రం కిటకిటలాడింది. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు అందజేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. – మంత్రాలయం







పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నుంచి అనుగ్రహ ప్రశస్తి అవార్డు అందుకుంటున్న విశ్వనాథ కరడ్, రామ విఠల ఆచార్య, కర్ణాటక హైకోర్టు జడ్జి శ్రీషానంద

‘ఈ-శ్రమ్’తో కార్మికులకు భద్రత

- నమోదు చేసుకున్న వారికి ఏడాది పాటు రూ.2 లక్షల ప్రమాద, అంగవైకల్య బీమా
- గ్రామ, వార్డు సచివాలయాలు, సీఎస్‌సీ కేంద్రాల్లో నమోదుకు అవకాశం

ఆదోని సెంట్రల్: అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డును రూపొందించింది. ఇందులో నమోదు చేసుకున్న కార్మికులకు ఏడాది పాటు పీఎంఎస్‌వై పథకం ద్వారా రూ.2 లక్షలు ప్రమాద బీమా, అంగవైకల్య బీమాను ఉచితంగా వర్తింపజేస్తారు. భవన నిర్మాణం, వ్యవసాయం, స్వయం ఉపాధి పొందే కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. 16- 59 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు ఈ పథకంలో చేరడానికి అర్హులు. గ్రామ, వార్డు సచివాలయాల్లో, లేదా సీఎస్‌సీ కేంద్రాలు, పోస్టాఫీసులో నమోదు చేయించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో ఈ-శ్రమ్ పోర్టల్‌లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న కార్మికులకు 12 అంకెలు కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డు (యూనివర్సల్ ఐడెంటీ నంబర్) ఇస్తారు. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, వివిధ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు.

అసంఘటిత కార్మికులు..

జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులను గుర్తించి వారిని ఈ-శ్రమ్ పోర్టల్ 5,41,236 మందిని నమోదు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కర్నూలు రెవిన్యూ డివిజన్‌లో 1,68,015 మందిని, ఆదోని రెవిన్యూ డివిజన్‌లో 3,73,221 మందిని నమోదు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. గతనెల 25 నాటికి జిల్లాలో 3,17,096 మందిని ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికులను నమోదు చేయించారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లో 1,19,398 మందిని, ఆదోని డివిజన్‌లో 1,97,698 మంది కార్మికులను నమోదు చేశారు. భవన నిర్మాణ రంగంలో తాపీ పనిచేసేవారు, సెంట్రింగ్,రాడ్ బెండింగ్ కార్పెంటర్, పెయింటింగ్, ఫిల్లింగ్ టైల్స్, వెల్డింగ్ ఎలక్ట్రికల్, ఇటుకల తయారీ, సున్నపు బట్టీలు, కాంక్రీటు, మిక్సర్ పనులు, బావులు తవ్వడం, పూడిక తీయడం వంటి పనులు చేసేవారు నమోదు చేయించుకోవచ్చు.



ఈ-శ్రమ్ కార్డు

- వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్న చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, పాడి పరిశ్రమపై అధారపడి జీవించే వారు, ఉద్యాన పంటలు, నర్సరీలు సాగుచేసే రైతులు, మత్స్యకారులు, ఉపాధి కూలీలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగనవాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఇళ్లలో పాచి పనులు చేసేవారు. కొరియర్ బాయ్స్ అర్హులు
- స్వయం ఉపాధి పొందే వీధి వ్యాపారులు, తోపుడు బండ్లు, కల్లుగీత కార్మికులు, ఆటో కార్మికులు, కళాకారులు, బీడి కార్మికులు, చెత్త సేకరించేవారు, హమాలీలు, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, ఆటోమొబైల్ రంగం, రవాణా రంగాల్లో పనిచేసే డ్రైవర్లు, చేనేత కార్మికులు, కుమ్మరి, వడ్రంగి, స్వర్ణకారులు తదితర కళావృత్తుల్లో పనిచేసే వారిని అసంఘటిత కార్మికులుగా గుర్తిస్తారు.

ఇలా నమోదు చేసుకోవాలి..

ఈ-కేవైసీ కలిగిన అధార్ కార్డు, అధార్ కార్డుకు నమోదైన ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్, బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. నమోదు చేసుకున్న కార్మికుడితో పాటు నామినీకి సంబంధించిన అధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ జత చేయాలి. ఈ-శ్రమ్ పోర్టల్‌లో అధార్ నమోదు చేయగానే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఫోను నంబర్ లేని వారు ఐరిస్, బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేసుకోవచ్చు. గ్రామ వార్డు సచివాలయాల్లో ఉచితంగా నమోదుకు అవకాశం కల్పించింది. వీటితో పాటు కామన్ సర్వీస్ సెంటర్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, కార్మికశాఖ కార్యాలయంలోనూ నమోదు చేసుకునే వెసులుబాటుంది. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదు చేసుకున్న వారికి యూఏఎన్‌తో కూడిన కార్డు అందజేస్తారు.



పెసలబండ వద్ద ‘ఉపాధి’ పనులు చేస్తున్న కూలీలు

ఉపయోగాలు..

- ఏదేని ప్రమాదంలో కార్మికుడు మరణిస్తే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద కుటుంబానికి రూ.2లక్షలు అందజేస్తారు.
- అంగవైకల్యం కలిగితే రూ.లక్ష వరకు అందుతుంది.
- కార్డు ఉన్న వారి బ్యాంక్ ఖాతాకు ఎప్పటికప్పుడు కొంత మొత్తాన్ని జమ చేస్తుంది.
- 60 ఏళ్లు పైబడిన వారికి రూ.3వేల వరకు పెన్షన్ లభిస్తుంది.
- ఈ-లేబర్ కార్డు ఉన్న కూలీలకు ప్రభుత్వం ఉపాధిని కల్పిస్తుంది.
- పథకాల అమలులో ప్రాధాన్యత ఇస్తుంది.

నమోదు చేసుకోవడం మంచిది



అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవడం ఎంతో మంచిది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఈ యూనిక్ నంబర్ అధారంగానే అందించే అవకాశం ఉంది. ఆదోని డివిజన్‌లో ఇప్పటి వరకు 1,97,698 మందిని నమోదు చేయించాం. కార్మికులకు అవగాహన కల్పించి మరింత మందిని నమోదు చేసుకొనేలా చర్యలు చేపడుతున్నాం. స్వయం ఉపాధి పొందుతున్న ప్రతి ఒక్కరూ అసంఘటిత కార్మికులే.

– సుధాకర్‌బాబు కార్మిక శాఖ సహాయ కమిషనర్, ఆదోని